సంపుటి :02 సంచిక :150 పేజీలు :05

వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

శనివారం 02, ఆగస్టు 2025



రేవంత్ ముఖ్యమంత్రి కాదు..

# ఢిల్లీ టూరిస్ట్

- 'హస్తిన' పర్యటనల్లో సీఎం హాఫ్ సెంచరీ కొట్టారు..
- పర్యటనల ప్రయోజనం మాత్రం సున్నా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

02



## రైతు సంక్షేమమే లక్ష్యం..

మంత్రి శ్రీధర్ బాబు

రూ. 9,000 కోట్లు విడుదల

04



వయోవృద్ధుల

## డే కేర్ సెంటర్ ప్రారంభం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల కోసం ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, రెడ్ క్రాస్ సొసైటీ ప్యాట్రన్ నాయిని రాజేందర్ రెడ్డి శనివారం ప్రారంభించారు.

– అక్షరదర్బార్, హనుమకొండ

04

## కేటీఆర్ కేసులో మంత్రి సురేఖకు షాక్

క్రిమినల్ కేసు నమోదుకు కోర్టు ఆదేశం..



04



కాసర్ల శ్యామ్ కు ఎమ్మెల్యే అభినందన

04



# పాల నురగల జలపాతాలు

'ఉమ్మడి వరంగల్'లో ఊపందుకున్న పర్యాటకం

- ప్రాజెక్టులకు జలకళ.. జలపాతాల హోరు
- ఒక్క ములుగు జిల్లాలోనే ఏడు జలపాతాలు
- బొగత సందర్శనకు ప్రభుత్వ అనుమతి
- నిండుకుండలా పాకాల సరస్సు
- లక్నవరంలో బోటింగ్ పునఃప్రారంభం
- ప్రకృతి ప్రేమికులారా ఈ సండేను ఫన్ డే గా మార్చుకోండి

02

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. జలపాతాలు పాల నురగల్లా కిందికి దుంకుతున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యాటక రంగం మళ్లీ ఊపందుకుంది. ఈ ప్రాంతాలకు సందర్శకుల తాకిడి పెరిగి, పర్యాటక కేంద్రాలు కళకళలాడుతున్నాయి. ములుగు జిల్లాలో బొగతతో పాటు మరో ఏడు జలపాతాలు ఉన్నాయి. అవి బావణిసరి, మాసలొద్ది, దుస్సపాటి లొద్ది, గుండం, ఏనుగుసరి, మహితాపురం (120 అడుగులు), ముత్యంచారు (700 అడుగులు). ప్రస్తుతం వీటికి ప్రభుత్వ అనుమతులు లేవు. అయితే, కేంద్ర ప్రభుత్వం కర్రెగుట్టలను పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ ప్రయత్నాలు సఫలమైతే, ములుగు జిల్లా పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఏమైనప్పటికీ అక్కడికి వెళ్లే పర్యాటకులు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. పిల్లలతో వెళ్లేవారు మరింత అప్రమత్తంగా ఉండాలి.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి



## ముగిసిన పోలీసు డ్యూటీ మీట్

**ముగింపు వేడుకలకు హాజరైన డీజీపీ**

వరంగల్ మామునూరులోని పీటీసీలో మూడు రోజులపాటు జరిగిన పోలీస్ తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ -2025 శనివారం సాయంత్రం ముగిసింది. ముగింపు వేడుకలకు తెలంగాణ రాష్ట్ర పోలీసు డీజీపీ డా జితేందర్, జైళ్ల శాఖ డీజీ డా సౌమ్యమిశ్రా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తో పాటు డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, వివిధ విభాగాల పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ పోలీస్ డ్యూటీ మీట్ మామునూరులోని పీటీసీలో గురువారం ప్రారంభమైన విషయం తెలిసిందే. -అక్షరదర్బార్, మామునూరు



# రేవంత్ ముఖ్యమంత్రి కాదు.. ఢిల్లీ టూరిస్ట్

- ‘హస్తిన’ పర్యటనల్లో సీఎం హాఫ్ సెంచరీ కొట్టారు..
- పర్యటనల ప్రయోజనం మాత్రం సున్నా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

అక్షరదర్బార్, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం ఓ ప్రకటనలో తీవ్ర విమర్శలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి 50 సార్లు ఢిల్లీకి వెళ్లినా, తెలంగాణకు ఎలాంటి ప్రయోజనం లేదని ఎద్దేవా చేశారు. ‘జీరో రిజల్ట్స్’ తో వెనక్కి వచ్చారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర పాలన ఫైల్స్‌తో కాకుండా, ఫ్లైట్ బుకింగ్స్‌తో నడుస్తోందని కేటీఆర్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రేవంత్ ఢిల్లీ పర్యటనలకు, తెలంగాణ ప్రజల సమస్యలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర లేదని, యూరియా కొరత ఉందని, సాగు, తాగునీటి సమస్యలు ఉన్నాయని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం ఈ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, రుణమాఫీ, రైతు భరోసా, తులం బంగారం, రూ. 4 వేల పింఛన్ వంటి హామీల ఊసే లేదని కేటీఆర్ మండిపడ్డారు. గురుకులాల విద్యార్థుల సమస్యలను కూడా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి కేవలం ఫొటో షూట్‌లు, వీడియోలు, విందు రాజకీయాలకే పరిమితమయ్యారని, ఆయన రాష్ట్రానికి పాలించే ముఖ్యమంత్రి కావాలి తప్ప, ఢిల్లీకి టూరిస్ట్‌లా వెళ్లే సీఎం కాదని వ్యాఖ్యానించారు.

# సిరికొండ పరామర్శ

## ఆత్మహత్యలు వద్దు

రేగొండ, శుక్రవారం: ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి రేగొండ మండలం తిరుమలగిరిలో ఆత్మహత్య చేసుకున్న పొలబోయిన సంగీత్ (25) కుటుంబాన్ని పరామర్శించారు. యువత క్షణికావేశంతో ప్రాణాలు తీసుకోవద్దని, కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలని ఆయన సూచించారు.







## లక్నవరం బోటింగ్ పునఃప్రారంభం

ములుగు జిల్లాలోని గోవిందరావుపేట మండలం పరిధిలో ఉన్న లక్నవరం సరస్సు పర్యాటకులకు మళ్లీ స్వాగతం పలుకుతోంది. ఇటీవలి వర్షాలు, వరదల వల్ల సరస్సు పూర్తిస్థాయిలో నిండిపోయింది. దీంతో 111 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత బోటింగ్ సేవలను తిరిగి ప్రారంభించారు. పర్యాటకులు బోటు షికారు చేస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. సరస్సు నిండటంతో కాటేజీల ఆన్‌లైన్ బుకింగ్‌లు కూడా పెరిగినట్లు అధికారులు తెలిపారు.



## అంద చందాల పాకాల సరస్సు

వరంగల్ జిల్లాలోని ఖానాపురం మండలంలో ఉన్న పాకాల సరస్సు కూడా జలకళను సంతరించుకుంది. సరస్సు నీటిమట్టం 24.5 అడుగులకు చేరింది, మరో 5 అడుగులు పెరిగితే మత్తడి పోసే అవకాశం ఉంది. సరస్సు నిండు కుండలా ఉండటంతో పర్యాటకులు చూసేందుకు తరలివస్తున్నారు.



## నురగ తరగల బొగత జలపాతం

ములుగు జిల్లాలోని వాజేడు మండలం, చీకుపల్లి అటవీ ప్రాంతంలోని బొగత జలపాతం సందర్శనకు సోమవారం నుంచి అనుమతి లభించింది. భారీ వర్షాల కారణంగా గతంలో ఈ జలపాతం సందర్శనను నిలిపివేశారు. ప్రస్తుతం వర్షాలు, వరదలు తగ్గుముఖం పట్టడంతో తిరిగి అనుమతులు ఇచ్చారు. అయితే, సందర్శకులను కేవలం జలపాతాన్ని వీక్షించడానికి మాత్రమే అనుమతిస్తారు, ఈత కొలనులోకి దిగి స్నానాలు చేయడానికి అనుమతి లేదు. బొగత జలపాతం వరంగల్ నుంచి దాదాపు 130 కిలోమీటర్ల దూరంలో ఉంది.

# పాల నురగల జలపాతాలు

- ‘ఉమ్మడి వరంగల్’లో ఊపందుకున్న పర్యాటకం
- ప్రాజెక్టులకు జలకళ.. జలపాతాల హోరు
- ఒక్క ములుగు జిల్లాలోనే ఏడు జలపాతాలు
- నిండుకుండలా పాకాల సరస్సు
- లక్నవరంలో బోటింగ్ పునఃప్రారంభం
- బొగత సందర్శనకు ప్రభుత్వ అనుమతి
- ప్రకృతి ప్రేమికులారా ఈ సండేను ఫన్ డే గా మార్చుకోండి


**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :** ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. జలపాతాలు పాల నురగల్లా కిందికి దుంకుతున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యాటక రంగం మళ్లీ ఊపందుకుంది. ఈ ప్రాంతాలకు సందర్శకుల తాకిడి పెరిగి, పర్యాటక కేంద్రాలు కళకళలాడుతున్నాయి. ములుగు జిల్లాలో బొగతతో పాటు మరో ఏడు జలపాతాలు ఉన్నాయి. అవి బావణిసరి, మాసలొద్ది, దుస్సపాటి లొద్ది, గుండం, ఏనుగుసరి, మహితాపురం (120 అడుగులు), ముత్యంచారు (700 అడుగులు). ప్రస్తుతం వీటికి ప్రభుత్వ అనుమతులు లేవు. అయితే, కేంద్ర ప్రభుత్వం కర్రెగుట్టలను పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ ప్రయత్నాలు సఫలమైతే, ములుగు జిల్లా పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఏమైనప్పటికీ అక్కడికి వెళ్లే పర్యాటకులు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. పిల్లలతో వెళ్లేవారు మరింత అప్రమత్తంగా ఉండాలి.

### భీమునిపాదంలో జలసవ్వడి

మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండలం, సీతానాగారం శివారులోని కొమ్ములవంచ అటవీ ప్రాంతంలో ఉన్న భీమునిపాదం జలపాతం వర్షాలతో మరింత ఉధృతంగా ప్రవహిస్తోంది. 70 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతున్న ఈ జలధారలను చూసి పర్యాటకులు ఆశ్చర్యపోతున్నారు. ఈ జలపాతం ట్రెక్కింగ్, క్యాంపింగ్, అడ్వెంచర్ ఎకో టూరిజానికి అనువైన ప్రాంతంగా పేరు పొందింది. పచ్చని ప్రకృతి, రకరకాల పక్షులు ఇక్కడ పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు సిబ్బందిని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. బయ్యారం గుట్టల మధ్య ఉన్న జలపాతం కూడా వర్షాలతో నిండి కనువిందు చేస్తోంది. యువత, పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శించి ఆనందిస్తున్నారు.

### ములుగు జిల్లాలోని జలపాతాలు

- బొగత జలపాతం
- బావణిసరి
- మాసలొద్ది
- దుస్సపాటి లొద్ది
- గుండం
- ఏనుగుసరి
- మహితాపురం (120 అడుగుల ఎత్తు)
- ముత్యంచారు (700 అడుగుల ఎత్తు)





# రైతులకు ఆదివాసీ నవ నిర్మాణ సేన అవగాహన




అక్షర దర్బార్, వెంకటాపురం (నుగూరు) : నకిలీ విత్తనాలు, ఎరువుల మోసాల నుంచి రైతులను కాపాడేందుకు ఆదివాసి నవ నిర్మాణ సేన ఆధ్వర్యంలో ఒంటి మామిడిలో అవగాహన సదస్సు జరిగింది. వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ నాగభూషణం, డాక్టర్ వీరన్నలు పంటల సాగు మెలకువలు, సేంద్రియ ఎరువుల వాడకంపై సూచనలు ఇచ్చారు. ఆదివాసి నవ నిర్మాణ సేన నాయకులు కొర్సా నరసింహమూర్తి, వాసం నాగరాజులు రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని అవినాష్ వర్మ తెలిపారు. ఆధునిక పద్ధతులు పాటిస్తూ, రసీదులు తీసుకోవాలని కోరారు. రైతులకు నిరంతరం శిక్షణ అవసరమని కొర్సా నరసింహమూర్తి అన్నారు. 200 మందికి పైగా రైతులు హాజరయ్యారు.

# స్థానిక ఎన్నికల గెలుపే లక్ష్యం



అక్షర దర్బార్, దుగ్గొండి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి పార్టీ కార్యకర్తలను కోరారు. గుడ్డెలుగులపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థులకు అధిక మెజారిటీని ఇవ్వాలని, ఇందుకోసం కార్యకర్తలు కృషి చేయాలని శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. 16 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ పథకాల ఆదరణను ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి చొరవతో అధిక నిధులు తెచ్చి సీసీ రోడ్లు, మహిళా సంఘ భవనాలు నిర్మిస్తామని తెలిపారు. మండల అధ్యక్షుడు చుక్క రమేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అండగా ఉంటుందని, సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.



# కేసుల విచారణలో పోలీసు జాగిలాలు కీలకం

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే**



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైం: పోలీసు శాఖలో వివిధ కేసుల విచారణలో పోలీసు జాగిలాల సేవలు కీలకమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు జాగిలాల కోసం నూతన గదులను ఎస్పీ , పోలీసు అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం జాగిలాలు ఎస్పీకి గౌరవం అందజేశాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పోలీసు జాగిలాల సౌకర్యార్థం నూతనంగా నాలుగు గదులను ప్రారంభించినట్లు తెలిపారు. పేలుడు పదార్థాలు కనుక్కోవడం, హత్య కేసులను చేధించడం, మాదక ద్రవ్యాలను, దొంగలను పసిగట్టడం వివిధ కేసుల విచారణలో పోలీసు జాగిలా ల సేవలు వినియోగిస్తామన్నారు. జాగిలాలకు ప్రతిరోజు వ్యాయామం చేయించడంతో పాటు, మెనూ ప్రకారం ఆహారం అందిస్తూ ఆరోగ్యవంతంగా ఉండేలా చూడాలని డాగ్ స్క్వాడ్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ నరేష్ కుమార్, డీఎస్పీలు సంపత్ రావు, నారాయణ నాయక్, ఇన్స్పెక్టర్లు నరేష్, నగేష్,కిరణ్, రత్నం, ఎస్ బి ఇన్స్పెక్టర్ నరేష్, రమేష్ , వెంకటేశ్వర్లు, డాగ్ హ్యాండ్లర్స్ తిరుపతి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే గండ్రది.. నీచ రాజకీయం..

- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయద్దు
- రేగొండ మండల కాంగ్రెస్ నాయకుల ఫైర్..



అక్షర దర్బార్ , రేగొండ: మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిది నీచ రాజకీయమని ప్రజల్లో తన ఉనికిని కాపాడుకోవడానికే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాడని రేగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య విమర్శించారు. శనివారం ఆయన మండల నాయకులతో కలిసి కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొన్ని రోజుల క్రితం భూపాలపల్లి మంజూరునగర్ లో బర్ల షెడ్డు ను చట్టపరంగా అధికారులు కూల్చి వేస్తే దాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కావాలనే కూల్చి వేశాడంటు బర్ల షెడ్డు యజమానికి మాయ మాటలు చెప్పి గేదే లను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తోలి సత్తన్న పై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం నీచ రాజకీయమన్నారు.ఎమ్మెల్యే సత్యనారాయణ రావు రాజ్యాంగాన్ని గౌరవించి చట్టపరంగా మాత్రమే పనులు చేస్తాడని నీలాగా చట్టాన్ని చుట్టంలా వాడి పేదల భూములు కబ్జాలు చేయడని దుయ్యబట్టారు. భూపాలపల్లి సిఐ పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు గాను బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బహిరంగ క్షమాపణలు చెప్పాలని,లేని యెడల చట్టపరంగా వారిపై చర్యలు తీసుకోవాలని నరసయ్య డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి వ్యవసాయ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, పిఏసిఎస్ చైర్మన్ నడిపల్లి విజ్జన్ రావు పాల్గొన్నారు.

# మండల బంద్‌కు పిలుపు

**ఆలూబాకలో మానవహారం**

అక్షర దర్బార్, వెంకటాపురం (నూగూరు): రోడ్ల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఈ నెల 6న మండల బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి. రెడ్డి సాంబశివ ప్రజలను కోరారు. నిరసనల్లో భాగంగా మొర్రవానిగూడెం, ఆలూబాక, సూరవీడు గ్రామాల్లో మానవహారాలు నిర్వహించారు. ఇసుక లారీల వల్ల దెబ్బతిన్న రోడ్లను తక్షణం బాగుచేయాలని సాంబశివ డిమాండ్ చేశారు. వెంకటాపురం-చర్ల మధ్యనున్న రాళ్లవాగు బ్రిడ్జి పిల్లర్ కూలే స్థితిలో ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళనలు కొనసాగుతాయని, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి గ్యానం వాసు, సీనియర్ నాయకులు వంకా రాములు సహా పలువురు పాల్గొన్నారు.



# ఆపదలో అండగా మల్లేశం గౌడ్

అక్షర దర్బార్, పరకాల : పరకాల మండలం లక్ష్మీపురం గ్రామంలో మంగళపల్లి లక్ష్మి అనారోగ్య కారణాలతో మృతి చెందగా ఆ విషయాన్ని తెలుకొని జాతీయ బీసీ సంక్షేమ సంఘం పరకాల నియోజకవర్గ ఇంచార్జి అముదాలపెల్లి మల్లేశం గౌడ్ బృందం చనిపోయిన కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు.



# అభివృద్ధిలో వెనుకబాటుకు గత పాలకుల నిర్లక్ష్యమే కారణం

- పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలి
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- పలు అభివృద్ధి పనుల పరిశీలన



అక్షర దర్బార్, పరకాల: గత పాలకుల నిర్లక్ష్యం వల్లే పరకాల అభివృద్ధిలో వెనుకబడిందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. పరకాల పట్టణ అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన కోరారు. శనివారం ఆయన పరకాల మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా, 19వ వార్డు పరిధిలోని పాత సిఎంఎస్ గోదాం వద్ద, అలాగే 14వ వార్డు పరిధిలోని పాత మసీద్ వాడ, గండ్ర వాడల్లో జరుగుతున్న డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే పరిశీలించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. అనంతరం, 14వ వార్డు పరిధిలోని ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పరకాల పట్టణం భవిష్యత్తులో ముంపునకు గురికాకుండా పటిష్టమైన ప్రణాళికతో, అంచెలంచెలుగా ఒక నగరాన్ని తలపించేలా సుందరీకరణ చేసి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందుకోసం ప్రజల సహకారం తప్పనిసరి అని నొక్కిచెప్పారు. ఇప్పటికే సుమారు రూ. 24 కోట్లతో పరకాల పట్టణ ప్రాంతంలో పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని, విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ కమిషనర్ కే సుష్మ, ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజారెడ్డి, కుంకుమేశ్వర ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వర రావు, మున్సిపాలిటీ ఏఈ రంజిత్ తదితర ముఖ్య నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహా భాగ్యం

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ రమేష్ బాబు**



భూపాలపల్లి క్రైమ్: కోర్టులో పనిచేసే న్యాయవాదులు, ఉద్యోగులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్. రమేష్ బాబు అన్నారు. అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన హెల్త్ క్యాంపును ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆధునిక బిజీ జీవితాల్లో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రధాన న్యాయమూర్తి సూచించారు. ఈ క్యాంపులో బీపీ, షుగర్, ఈసీజీ, మరియు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఏ. నాగరాజ్, అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.శ్రీనివాస చారి, ప్రధాన కార్యదర్శి వి.శ్రవణ్ రావు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనితావని, మేడికవర్ హాస్పిటల్, శరత్ కంటి హాస్పిటల్ డాక్టర్లు, వారి సిబ్బంది, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# డీసీసీ బ్యాంక్ కార్యాలయం మార్పు

**కొత్త పథకాలతో గ్రామీణాభివృద్ధి**

అక్షర దర్బార్, కేసముద్రం: కేసముద్రం డీసీసీ బ్యాంక్ కార్యాలయం త్వరలో స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయం కింది ఫ్లోర్‌లోకి మారనుంది అని బ్రాంచ్ మేనేజర్ చైతన్య తెలిపారు. ఆమె మాట్లాడుతూ, వరంగల్ డీసీసీ బ్యాంక్ గ్రామీణాభివృద్ధికి కృషి చేస్తోందని, ఆకర్షణీయమైన డిపాజిట్, రుణ పథకాలను అందిస్తోందని చెప్పారు. 2025 అంతర్జాతీయ సహకార సంఘాల సంవత్సరాన్ని పురస్కరించుకుని, ఇతర బ్యాంకుల కంటే అధికంగా 8.4% వడ్డీని అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లల కోసం "బాలవికాస నెలవారీ పొదుపు పథకం"ను (7.50% వడ్డీతో) ప్రారంభించారు. అలాగే, బంగారంపై 90శాతం వరకు, గృహ రుణాలను అందిస్తున్నామన్నారు. గ్రామీణ విద్యార్థుల ఉన్నత విద్య కోసం వ్యవసాయ భూమి తాకట్టుపై రుణాలు ఇచ్చే ఏకైక బ్యాంక్ తమదేనని చైతన్య పేర్కొన్నారు. గూగుల్ పే, ఫోన్ పే వంటి డిజిటల్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రామీణ ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

# చిరు వ్యాపారులకు శాశ్వత పరిష్కారం చూపాలి

అక్షర దర్బార్, నర్సంపేట: నర్సంపేట పట్టణంలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులకు శాశ్వత పరిష్కారం చూపాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ అధికారులను డిమాండ్ చేశారు. శనివారం ఆయన మున్సిపల్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. పండ్లు, కూరగాయల వ్యాపారులు సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారని సందీప్ తెలిపారు. కోర్టు ప్రహరీ, అగ్రికల్చర్ గోదాములు, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు లేదా బస్టాండ్ ఆవరణలోని నిరుపయోగ స్థలంలో వారికి శాశ్వత కేటాయింపులు చేయాలని సూచించారు. కూరగాయల వ్యాపారులకు అంగడిలో స్థలం కేటాయించి వారి జీవనోపాధిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూలూరి మనీష్ గౌడ్, అచ్చ దయాకర్ సహా పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమమే లక్ష్యం..



## మంత్రి శ్రీధర్ బాబు

## రూ. 9,000 కోట్లు విడుదల

అక్షర దర్బార్, మల్హార్ : రైతులకు సకల సౌకర్యాలతో పాటు గౌరవం కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. శనివారం మల్హార్ మండలం తాడిచర్లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు.

సహకార సంఘం ద్వారా రైతులకు బ్యాంకు సేవలు, వ్యవసాయ రుణాలు సులభతరం అవుతాయని మంత్రి అన్నారు. రేషన్ కార్డుల సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున రేషన్ కార్డులు, పాత కార్డుల్లో కుటుంబ సభ్యుల నమోదు ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతులకు రూ. 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా ద్వారా అందించామని మంత్రి వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రారంభించిన, శంకుస్థాపన చేసిన పనులు**

రూ. 50 లక్షల సహకార సంఘ కార్యాలయం, గోదాం భవనం ప్రారంభం.
రూ. 25 లక్షల గ్రంథాలయ భవనం ప్రారంభం.
రూ. 7.80 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన.
రూ. 3.5 లక్షల ఆర్చిగేట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన.
రూ. 12 లక్షల తహసీల్దార్ కార్యాలయ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన.



# వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభం



అక్షరదర్బార్, హనుమకొండ: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల కోసం ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, రెడ్ క్రాస్ సొసైటీ ప్యాట్రన్ నాయిని రాజేందర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి వృద్ధులతో సంభాషించిన ఆయన, తరువాత తలసీమియా పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ముందుగా ఎమ్మెల్యేకు రెడ్ క్రాస్ చైర్మన్ డా పి విజయచందర్ రెడ్డి, పాలకవర్గం సభ్యులు ఘన స్వాగతం పలికారు. పూలమొక్క అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ మాట్లాడుతూ, 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఉచితంగా డాక్టర్ల సేవలు, చెస్, క్యారమ్ వంటి ఆటల సౌకర్యం అందిస్తామన్నారు. వృద్ధులు సమయం విలువైనదిగా గడిపే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 37 డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందులో హనుమకొండలో రాష్ట్రంలో మొట్టమొదటిగా ఈ సెంటర్ ప్రారంభమవడం గర్వకారణమని అన్నారు. రెడ్ క్రాస్ రక్తదానం, ఇతర సేవలకు రాష్ట్రంలో తొలి స్థానంలో నిలుస్తున్న హనుమకొండ రెడ్ క్రాస్ పాలకవర్గాన్ని ప్రత్యేకంగా అభినందించారు. రెడ్ క్రాస్ సేవలకు మరింత తోడ్పాటు అందించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హనుమకొండ రెడ్ క్రాస్ సందర్శించేవిధంగా ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా వృద్ధులను చేనేత కళాకారులు తయారు చేసిన టవెల్స్ తో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యేకు పాలకవర్గం షీల్డ్ అందించి సత్కరించింది. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డా పి విజయచందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, డా ఎం శేషుమాధవ్, బిళ్ల రమణరెడ్డి, మహిళా శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ అధికారి జె జయంతి, డీఆర్డీఓ పీడీ ఎం శ్రీను, హనుమకొండ డీఎంహెచ్వో ఎ అప్పయ్య, కేయూ ఈసీ సభ్యులు కే అనిత రెడ్డి, వృద్ధులు, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డును కబ్జా చేసి షెడ్డు వేశారు

- ❖ ఆ షెడ్డు స్థలానికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేవు
- ❖ ఎమ్మెల్యే గ్రాఫ్ పడగొట్టడానికే కొందరు కుట్ర పన్నారు
- ❖ క్యాంపు కార్యాలయంలోకి బర్లను తోలిన ఘటనపై భూమి యజమానులు

అక్షరదర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బర్లను తోలిన ఘటనలో బిగ్ ట్విస్ట్ చోటుచేసుకుంది. కూల్చివేతకు గురైన బర్ల షెడ్డు భూమి యజమానులు శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గ్రాఫ్ పడగొట్టడానికే కొందరు ఈ పన్నాగానికి ఒడిగట్టారని ఆరోపించారు. తమ బర్ల షెడ్డును అధికారులు కూల్చివేయటాన్ని నిరసిస్తూ గురువారం కూరాకుల ఓదెలు, లలిత దంపతులు తమ బర్లను భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తోలిన విషయం తెలిసిందే. దీంతో ఇది రాజకీయంగా వివాదానికి దారి తీసింది. బర్ల షెడ్డు కూల్చివేత వెనుక ఎమ్మెల్యే గండ సత్యనారాయణరావు పాత్ర ఉందని కొందరు ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో కూల్చివేతకు గురైన బర్ల షెడ్డు భూమి యజమానులు దొంతుల వేణుమాధవ్, మేకల రమేష్ మీడియా ముందుకు వచ్చారు. కూరాకుల ఓదెలు, లలిత దంపతులు తమ బర్ల కోసం వేసుకున్న షెడ్డు స్థలానికి ఎలాంటి పత్రాలు లేవని, రోడ్డును కబ్జా చేసి బర్ల షెడ్డు నిర్మించారని చెప్పారు. ఆ రోడ్డు కూడా పక్కనే ఉన్న పాఠశాలకు సంబంధించిన రోడ్డు అని చెప్పారు. రోడ్డు కబ్జా చేసి వేసుకోవడం వల్ల మున్సిపల్ అధికారులు బర్ల షెడ్డును కూల్చివేశారని తెలిపారు. అయితే కూల్చివేతకు గురైన బర్ల షెడ్డుకు సంబంధించిన భూమిని తాము 2010లోనే కొనుగోలు చేసినట్లు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లను చూపారు. కేవలం ఎమ్మెల్యే సత్యనారాయణరావు ను రాజకీయంగా బదనం చేయాలనే కుట్రతో కొందరు కూరాకుల ఓదెలు, లలిత దంపతులను తప్పుదోవ పట్టించారని అన్నారు. జరిగిన ఘటనపై జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



# గత ప్రభుత్వంలో గురుకులాలు నిర్వీర్యం

**విద్యా వ్యవస్థ పై పురోగతి సాదిస్తున్నం.**

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.**

అక్షర దర్బార్, రేగొండ: గత ప్రభుత్వంలో పాలకులు గురుకులాలను నిర్వీర్యం చేసి విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు విమర్శించారు.ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే మండల కేంద్రంలోని కేజీబీవీ గురుకులాన్ని స్థానిక నాయకులతో కలిసి తనిఖీ చేశారు.విద్యార్థులను భోజనం,వసతి పై వివరాలు అడిగి తెలుసుకుని వారితో కలిసి భోజనం చేశారు.నాణ్యమైన విద్య,పోషకాలు కలిగిన భోజనాన్ని విద్యార్థులకు అందజేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో విద్యావ్యవస్థ పై పురోగతి సాధిస్తున్నామన్నారు. రాష్ట్రం లోని అన్ని వసతి గురుకులాల విద్యార్థుల డైట్, కాస్మెటిక్ చార్జీలను 200 శాతం పెంచిన ఘనత మా ప్రభుత్వానిదేనని అన్నారు.విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం,చలికాలంలో గీజర్లు,దుప్పట్ల తో మెరుగైన వసతులు కల్పిస్తున్నామన్నారు. మైలారం లో సమీకృత గురుకుల భవనాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు మంజూరు చేసిందని ఒక్కో భవనానికి రూ.28 కోట్ల చొప్పున 7 భవనాలను 18 నెలల్లో నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.బిఆర్ఎస్ నాయకులు ప్రధాన ప్రతిపక్ష హోదాలో ఉండి గురుకులాలను విజిట్ చేసి విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అవుతుందని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు.ప్రతిపక్ష పార్టీగా సూచనలు ఇవ్వాలని సూచించారు.గురుకుల మౌలిక వసతుల కోసం రూ.13 లక్షలు మంజూరు చేశానని గతంలో కూడా గురుకుల అవసరాలకు రూ.10 లక్షలు ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గురుకులంలో 240 మంది విద్యార్థులు ఉన్నారని వారి అవసరాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ మనోరమ,భూపాలపల్లి వ్యవసాయ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, పిఎసిఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, మండల అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య, టౌన్ అధ్యక్షుడు ఏనుగు రవీందర్ రెడ్డి, బుగులోని జాతర చైర్మన్ రొంటాల వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకులు మోడెం ఉమేష్ గౌడ్, పున్నం రవి, మైస బిక్షపతి, మేకల బిక్షపతి, గండి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



# కేటీఆర్ కేసులో మంత్రి సురేఖకు షాక్

**క్రిమినల్ కేసు నమోదుకు కోర్టు ఆదేశం..**



అక్షరదర్బార్, హైదరాబాద్: హైదరాబాద్ నాంపల్లి కోర్టులో రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు చుక్కెదురైంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వేసిన పరువు నష్టం దావా కేసులో నాంపల్లి కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రాథమిక సాక్ష్యాలను పరిశీలించిన న్యాయస్థానం... ఈ నెల 21లోపు మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. కేసు నమోదు చేసి కొండా సురేఖకి నోటీసు జారీ చేయాలని సూచించింది. మంత్రి కొండా సురేఖపై కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్ పై శనివారం నాంపల్లి కోర్టు విచారించింది. కేటీఆర్ పై కొండా సురేఖ నిరాధారమైన ఆరోపణలు చేశారన్న కేటీఆర్ న్యాయవాది వాదనలతో కోర్టు ఏకీభవించింది. ఫిర్యాదుతో పాటు సాక్ష్యుల వాంగ్మూలాలు, డాక్యుమెంట్లు పరిశీలించిన తర్వాత కొండా సురేఖపై ప్రాథమిక కేసు ఉన్నట్టు గుర్తించింది కోర్టు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఓ సినీ కుటుంబాన్ని ప్రస్తావిస్తూ కేటీఆర్ పై తీవ్ర ఆరోపణలు చేశారు మంత్రి కొండా సురేఖ. అప్పట్లో ఈ అంశం తీవ్ర దుమారం రేపింది. రాజకీయవర్గాల్లో మంటలు రాజేసింది. తనపై మంత్రి చేసిన ఆరోపణలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఆయన కోర్టును ఆశ్రయించారు. కొండా సురేఖపై క్రిమిల్ దావా చేశారు. దీనిపై పలుమార్లు విచారణ జరిపిన నాంపల్లి కోర్టు.. ఇవాళ కీలక ఆదేశాలు ఇచ్చింది. మంత్రిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది.

# అక్రమ ఇసుక రవాణాని అరికట్టాలి



అక్షర దర్బార్, కాటారం : కాటారం మండలం లోని విలాసాగర్ కేంద్రంగా నడుస్తున్న ఇసుక అక్రమ రవాణాని అరికట్టాలని టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మండల అధ్యక్షుడు జోడు శ్రీనివాస్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ నాగరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు.కొందరు అక్రమార్కులు విలాసాగర్ నుండీ ట్రాక్టర్ల ద్వారా ఇసుకని తరలించి అక్రమంగా ఇసుక డంపులు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల గృహ నిర్మాణాల అవసరాల పేరుతో పరిమిషన్లు తీసుకుని అధికార పార్టీ నాయకుల అండదండలతో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందన్నారు. కాటారం మండలంలో 24 గ్రామపంచాయతీలు ఉండగా ధనువాడ గ్రామానికి తప్ప ఏ ఒక్క గ్రామపంచాయతీకి ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ కాలేదని ఇందిరమ్మ ఇండ్ల పేరిట ప్రజలను మోసం చేస్తూ అక్రమ ఇసుక రవాణాకు అధికార పార్టీ నాయకులు, అధికారుల కనుసన్నల్లలో అక్రమాలకు పాల్పడుతున్నారని ఎద్దేవా చేశారు.ఈ క్రమంలోనే శుక్రవారం అర్ధరాత్రి కొత్తపల్లి గ్రామంలో అక్రమ ఇసుక డంపు దగ్గర లారీ లోడింగ్ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారని తెలియజేశారు.గత 18 నెలల నుండి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని పలు వేదికల్లో బీఆర్ఎస్ పార్టీ పక్షాన ఫిర్యాదులు చేసిన క్రమంలో అధికారులు అప్రమత్తమవుతున్నారన్నారు.కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, మండల నాయకులు మానెం రాజబాబు పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915